సాక్షి ఒడిశా

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,50,749లు, బంగారం 220 మిల్లీగ్రాములు, వెండి 79.45 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



సమన్వయమే కృషి మేళా లక్ష్యం

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బిశ్వరాజ్ రథో

-8లో



రాజీయే రాజమార్గం

- ముగిసిన జాతీయ లోక్ అదాలత్

-8లో

న్యూస్‌రీల్

ఘంటసాలకు ఘన నివాళులు

- నేడు సెంచూరియన్‌లో ఆరాధనోత్సవాలు



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైతన్య సాహితీ ప్రతినిధులు

పర్లాకిమిడి: దిగ్గజ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని పాతపట్నం రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి చైతన్య ఆంధ్రసాహితీ సంస్కృతి సమితి సభ్యులు శనివారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జి.నానాజీ పలు గీతాలను ఆలపించి, ఘంటసాల గీతాల ప్రత్యేకతను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి బర్నాల జనార్దనరావు, అధ్యక్షుడు ఆనందరావు, పి.కృష్ణమూర్తి, ఇసాయి వెంకట్రావు, యర్రా లక్ష్మణరావు, పి.రామరాజు(పాతపట్నం) తదితరులు పాల్గొన్నారు. అలాగే సెంచూరియన్ వర్సిటీ ఆడిటోరియంలో ఘంటసాల పాటల పోటీలు, సాంస్కృతిక కార్యాక్రమాలు ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే రెడ్డిశాంతి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

ఆడిటోరియం ఏర్పాటుకు సర్వే



ఆడిటోరియం నిర్మాణానికి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

జయపురం: పట్టణంలోని విక్రమదేవ్ స్వయం పాలిత కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవంలో సీఎం నవీన్ పట్నాయక్ సమక్షంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి చేసిన డిమాండ్లలో ఒక్కొక్కటీ నేరవేరుతున్నాయి. ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌ను అభివృద్ధి చేయాలని కోరిన మరుసటి రోజే 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ గుప్తేశ్వర్‌ను సందర్శించారు. ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే జగన్నాథ సాగర్ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. దీనితో పాటు విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక ఆడిటోరియం నిర్మాణానికి చురుగ్గా పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆర్అండ్‌బీ అధికారులు శనివార సర్వే చేపట్టారని ప్రిన్సిపాల్ గోపాల హల్దార్ వెల్లడించారు. 1000సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియమ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించిందన్నారు. సర్వే బృందం అనువైన స్థలాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ముకుందపూర్ ఘాటీలో మినీవ్యాన్ బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడి ఉన్న వ్యాన్

రాయగడ: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ నుంచి కటక్ వైపు కూరగాయల లోడ్‌తో వెళ్తున్న పికప్ వ్యాన్ కొలనరా సమితి ముకుందపూర్ ఘాటీలో అదుపుతప్పి బొల్తా పడింది. శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ స్వల్పగాయాలతో బైటపడ్డాడు. విషయం తెలుసుకున్న చందిలి పోలీసులు అక్కడికి చేరుకుని జేసీబీ సాయంతో వ్యాన్‌ను వెలుపలికి తీశారు. క్షతగాత్రుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పుడమిని పరిరక్షిద్దాం

- వ్యవసాయ శాస్త్రవేత్తలదే ఈ బాధ్యత
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు
- కటక్ ఐసీఏఆర్‌లో ద్వితీయ ఇండియన్ రైస్ కాంగ్రెస్ ప్రారంభం
- ఆకలి చావుల నుంచి ఎగుమతుల స్థాయికి చేరుకోవడంపై ప్రశంసలు





సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ముర్ము, గవర్నర్ గణేషీలాల్, కేంద్రమంత్రి నరేంద్రసింగ్



కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్తలు



రాష్ట్రపతికి గులాబీ అందిస్తున్న బాలుడు

భువనేశ్వర్: 'దేశంలో ఆహార భద్రతకు బియ్యం మూలాధారం. మన ఆర్థిక వ్యవస్థ పటిష్టతలో ఇదే కీలకమైన అంశం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గుర్తుచేశారు. అయితే పరిశోధనల పేరుతో అధిక రసాయనిక ఎరువులు వినియోగించ వద్దని, నేలతల్లిని పరిరక్షించే విధంగా సేంద్రియ వరి వంగడాలని ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కటక్ విద్యాధర్‌పూర్ లోని జాతీయ వరి పరిశోధనా కేంద్రం(ఐసీఏఆర్)లో ద్వితీయ ఇండియన్ రైస్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, రాష్ట్ర వ్యవసాయ, మత్స్య, పశుసంవర్థక శాఖామంత్రి రణేంద్రప్రతాప్ స్వాయి, జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్, ఎఆర్ఆర్‌డబ్ల్యూ అధ్యక్షుడు పీకే అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బియ్యం ఉత్పాదన, వినియోగం, ఎగుమతి రంగాల్లో దేశం అగ్రగామిగా ఉందన్నారు. ఆహారం కోసం ఇతర దేశాలపై ఆధారపడే రోజుల నుంచి ఎగుమతి చేసే స్థాయికి చేరడం గర్వకారణమని అభినందించారు. దిగుమతితో అరకొర ఆహారం నోటికి అందడమే క్లిష్ట పరిస్థితుల నుంచి ఇరుగు–పొరుగు దేశాల అవసరాలను ఆదుకున్న ఉన్నత దశకు చేరుకోగలిగామన్నారు. జాతీయ వరి పరిశోధనా సంస్థ నిరంతర పరిశోధన, కృషి ఈ సాఫల్యతకు ప్రధాన కారణమని ప్రశంసించారు. సంస్థ కృషి దేశపు ఆహార భద్రతకు అండగా నిలిచి, రైతుల జీవితాలను మెరుగు పరచడంలో అద్భుత ఫలితాలను సాధిస్తుందని తెలిపారు. గత శతాబ్దంలో నీటిపారుదల సౌకర్యాలు విస్తరణకు నోచుకున్నాయి. దీంతో వరి సాగుకు అనుకూల పరిస్థితులు అందుబాటులోకి వచ్చి, ఉత్పాదన పుంజుకోవడంతో వినియోగంతో ఎగుమతి చేసే సత్తా సాధించామని వివరించారు. అనంతరం రాష్ట్రపతి సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

మధ్యంతర ప్రణాళికతో..

వరి పంటను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తున్నాయని రాష్ట్రపతి ముర్ము తెలియజేశారు. సాగుకు అధిక మొత్తంలో నీరు అవసరం కాగా, పలు ప్రాంతాలు నీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. కరువు, వరదలు, తుఫాను వంటి ప్రకృతి విపత్తులు తరచూ వరి పంటకు హాని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త ప్రణాళికలో సాగు ఊపందుకుంటున్నా.. వర్ణనాతీతమైన సమస్యలను ఎదురీదాల్సిన పరిస్థితులు తాండవించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ అనుకూల అధునాతన సాగు విధానాలతో పారంపరిక వరిసాగు వ్యవస్థ పరిరక్షణకు వైజ్ఞానికులు మధ్యంతర సాగు ప్రణాళికను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అధిక స్థాయిలో రసాయనాల వినియోగం నేలతల్లికి అపార నష్టం చేకూర్చుతాయని గుర్తుచేశారు. పుడమి తల్లిని సారవంతంగా పరిరక్షించుకునేందుకు రసాయన రహిత సాగు విధానాల పట్ల దృష్టి సారించాలని ప్రోత్సహించారు. ఈ దిశలో జాతీయ వైజ్ఞానికుల సంకల్పం పట్ల ఆమె ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు.



లింగరాజ స్వామి ఆలయ సముదాయంలో ద్రౌపది ముర్ము (ఇన్‌సెట్లో) పూజలు చేస్తున్న రాష్ట్రపతి

ఇంకా ఏమన్నారంటే..

అన్నం(వరి) మన ఆహార భద్రతకు పునాది. నాణ్యమైన పోషకాహార విలువలతో కూడిన వరి సాగుకు ప్రాధాన్యత కల్పించాలి. అల్ప ఆదాయ వర్గాలకు అన్నమే జీవన ఆధారం. ఇది వారికి ఏకైక రోజువారీ పోషకాహారం. ఈ వర్గీయులకు వరి ద్వారా ప్రోటీన్, విటమిన్లు, అవసరమైన సూక్ష్మపోషకాలను అందించే దిశలో వరి సాగులో వైజ్ఞానికుల పరిశోధనలు మెరుగుపరచాలి. ఈ కృషి సాఫల్యత పౌష్టికాహార లోపాన్ని పారదోలేందుకు దోహదపడుతుంది. ఐసీఏఆర్–ఎన్ఆర్ఆర్ఐ భారత దేశపు మొట్టమొదటి అత్యున్నత పౌష్టికాహార వంగడం సీఆర్ 310 వంగడం ఆవిష్కరించడం అభినందనీయం. ఇటువంటి ఆవిష్కరణలు సామాజిక సంరక్షణకు వైజ్ఞానిక రంగం కృషికి అద్దం పడతుంది. వాతావరణ మార్పుల ప్రభావంతో వరి సాగులో సంప్రదాయతకు నీళ్లొదలకుండా జనాభా అవసరాలకు అనుగుణంగా నిరంతర వరి ఉత్పాదన క్రియాశీలక కార్యాచరణ కావాల'ని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

కేంద్రం సాయం..

కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ మాట్లాడుతూ వ్యవసాయం, రైతుల సాధికారితకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పంట నష్ట పరిహార పథకం రైతాంగానికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక కేటాయింపు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంతో ఇతర దేశాలకు ఆహార ధాన్యాల ఎగుమతి, ప్రకృతి వైపరిత్యాల పీడిత దేశాలకు ఆహార సహాయం అందించడంలో వ్యవసాయ రంగం దూసుకు పోయేందుకు దోహదపడుతుందని తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం కిసాన్ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 11.5కోట్ల మంది రైతులు రూ.2.24 లక్షల కోట్లు లబ్ధి పొందారని వెల్లడించారు.

రాజ్‌భవన్‌లో..

స్థానిక రాజ్‌భవన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన 'అభిషేక్ హాల్'ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌చంద్ర మహాపాత్రొ సహా పలువురు సీనియర్ ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. రూ.25.23 కోట్ల వ్యయంతో 47,390 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ హాలను నిర్మించారు. ప్రధాన మందిరంలో 900మంది అతిథులు కూర్చునేందుకు, 1200మంది వ్యక్తులు నిలబడేందుకు వీలవుతుంది. ఈ సముదాయంలో బాంకెట్ హాల్, ఐదు లాంజ్‌లు, నాలుగు ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు ఉన్నాయి.



అభిషేక్ హాల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్రపతితో గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్ పట్నాయక్

లింగరాజ.. నమోస్తుతే..

రాష్ట్రపతి ముర్ము ఏకామ్ర క్షేత్రంలో లింగరాజుని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దారి పొడవునా సాధారణ ప్రజానీకంతో అత్యంత సన్నిహితంగా స్పందిస్తూ ముందుకు సాగారు. చిన్నారులతో సంభాషించి, ముచ్చట గొలిపించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆమె పాలుపంచుకున్నారు. ఆలయ సముదాయంలో సిద్ధి వినాయకుడు, పార్వతీ దేవిని దర్శించుకున్నారు. ఆలయ వాకిలిలో కొద్దిసేపు ఆసీనులై సనాతనత చాటుకున్నారు. అనంతరం పాదరక్షలు లేకుండానే కాలి నడకన బింధుసాగర్‌కు చేరుకొని, సందర్శించారు. ఏకామ్రక్షేత్రం వీధుల్లో గిరిజనుల నృత్యాలు, సంగీత వాయిద్యాలతో రాష్ట్రపతికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్రపతి కుమార్తె ఇతిశ్రీ ముర్ము కూడా పాల్గొన్నారు.



దర్శనానంతరం స్వామి సన్నిధిలో ఆసీనురాలైన రాష్ట్రపతి ముర్ము

వెళ్లొస్తా..



విమానాశ్రయం వద్ద రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న గవర్నర్, ముఖ్యమంత్రి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2 రోజుల రాష్ట్ర పర్యటన శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్రపతికి గవర్నర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్, సీఎస్ సురేష్‌చంద్ర మహాపాత్రొ, సీనియర్ పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారులు హాజరై, వీడ్కోలు పలికారు.

క్రీడల్లో ఆసక్తి కనబరచాలి



వేదికపై శాంతారావు, శంకరరావు, సంతోష్ కుమార్

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో కూడా ఆసక్తి కనబరిస్తే వారి భవిష్యత్ ఉజ్వలంగా మారుతుందని మథర్ థెరిసా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎస్.శాంతారావు అన్నారు. పట్టణానికి సమీపంలోని కస్తూరీ నగర్ మథర్ థెరిసా పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలనతో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం క్రీడారంగం ప్రముఖపాత్ర పోషిస్తుందని, ఎంతో మంది క్రీడల్లో రాణించి ఉన్నతమైన స్థానాలను అధిరోహించారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.శంకరరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి ఏడాది విద్యార్థులను ఉత్సాహ పరిచేలా క్రీడలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, స్పూన్ రేస్, పరుగు పందెంలో 250మంది విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభ చాటుకున్నారని వివరించారు. కార్యక్రమంలో బి.సంతోష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.



పోటీలకు హాజరైన విద్యార్థులు

సినీ ఫక్కీలో ఏటీఎం లూటీ

- రూ.32 లక్షలు దోచుకెళ్లిన దుండగులు



బల్దాలో దోపిడీకి గురైన ఎస్‌బీఐ ఏటీఎం

కొరాపుట్: సినిమా స్టంట్ తరహాలో ఏటీఎంను దుండగులు దోచుకెళ్లిన ఘటన కొరాపుట్ జిల్లాలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలను నందపూర్ ఎస్‌డీపీఓ సంజయ్ కుమార్ మహాపాత్రొ శనివారం ప్రకటించారు. కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి బల్దా గ్రామంలోని ఏటీఎంలో ఎస్‌బీఐ అధికారులు శుక్రవారం నగదు నింపారు. దీనిని గమనించిన దుండగులు అర్ధరాత్రి సమయంలో నంబర్ పేట్లు లేని కార్లలో అక్కడికి చేరుకున్నారు. గ్యాస్ కట్టర్లతో మిషీన్‌ను పెకిలించి, రూ.32 లక్షల నగదు దోచుకున్నారు. అనంతరం సాక్ష్యాలు కనుమరుగు చేసేందుకు యంత్రానికి నిప్పంటించారు. ఉదయం ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఎస్‌డీపీఓ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. సమీప భవనంలో నమోదైన సీసీ కెమెరా లలో రికార్డయిన దృశ్యాలను సేకరించి, పరిశీలించారు. ఏటీఎం దోపిడీల్లో అనుభవం ఉన్న ముఠా ఈ పని చేసినట్లు భావిస్తున్నారు. నగదు నింపే రోజు కోసం ఎదురు చూడటం, నంబర్ లేని వాహనాల్లో రావడం, గ్యాస్ కట్టర్ల వినియోగం, సాక్ష్యాల్లేకుండా చేయడం తదితర చర్యలపై దృష్టి సారించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారులకు ఊరట

- సంబల్‌పూర్‌లో హింసకు దిగిన న్యాయవాదులను అరెస్ట్ చేసిన పోలీసులు
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు

భువనేశ్వర్: హైకోర్టు బెంచ్ ఏర్పాటు నినాదంతో ఆందోళన చేపట్టిన న్యాయవాదులకు స్వల్ప ఊరట లభించింది. ఈ ఉద్యమంలో పాలుపంచుకున్న 29మంది న్యాయవాదులకు వ్యతిరేకంగా కేసులు నమోదైన విషయం తెలిసిందే. 2022 డిసెంబర్ 12న హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం సంబల్‌పూర్‌లో చేపట్టిన ఆందోళనలో అధికారిక ఛాంబర్‌లో ఉన్న జిల్లా జడ్జిపై దాడి, కోర్టు ఆవరణలో విధ్వంసకర చర్యలకు పాల్పడినట్లు వీరిపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వారందరినీ అరెస్ట్ చేశారు. అయితే వీరంతా బెయిల్ కోసం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈకేసు విచారణ గురువారం ముగించి, శుక్రవారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసినట్లు రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ప్రకటించింది.

50 రోజులుగా జైలులో..

హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం ఆందోళనకు దిగిన న్యాయవాదులు 50 రోజులుగా కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. వీరికి స్థానిక కోర్టులు బెయిల్ అభ్యర్థనలను తిరస్కరించడంతో అప్పటి నుంచి వారంతా జైలులోనే మగ్గుతున్నారు. ఆందోళనకారుల తీరుపట్ల సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. వారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు ప్రమేయం ఉన్న అందరినీ అరెస్ట్ చేశారు.

బెయిల్ షరతులు

- నిందిత న్యాయవాదులు కోర్టుకు బేషరతుగా క్షమాపణ కోరాలి.
- సుప్రీంకోర్టులో ధిక్కార కేసు యథాతథంగా కొనసాగుతుంది.
- కేసుకు సంబంధించి న్యాయవాదులు ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించకూడదు.
- కేసుకు సంబంధించి ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎలాంటి అభిప్రాయం, వ్యాఖ్యలు, విశ్లేషణలు పోస్ట్ చేయకూడదు.
- విడుదలకు సంబంధించి ఎటువంటి ప్రకటనలు జారీ చేయరాదు.
- పికెటింగ్, సమ్మె వంటి కార్యకలాపాలకు దూరంగా ఉంటామని ఈ ఏడాది ఏప్రిల్ 1లేదా అంతకు ముందే సుప్రీంకోర్టులో లిఖిత పూర్వకంగా హామీ పత్రం దాఖలు చేయాలి.
- షరతులను ఉల్లంఘిస్తే బెయిల్‌ను రద్దు తథ్యమని హైకోర్టు స్పష్టం చేసింది.



న్యాయవాదుల ఆందోళనతో సంబల్‌పూర్ జిల్లా కోర్టులో ధ్వంసమైన ఫర్నీచర్(ఫైల్)

క్లుప్తంగా

బలవంతపు ఓటీలు రద్దు చేయాలి



శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ జేఏసీ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపోలో పెంచిన పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ ఏడు రోజులుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోని యాజమాన్య తీరుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నట్లు జేఏసీ నాయకులు కె.గణేష్, జి.త్రినాథ్, కె.దశరథ్, కె.బాబూరావు, పి.నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు శనివారం కూడా రిలే నిరాహారదీక్ష కొనసాగించారు. శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోల్లోనూ శనివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన, ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విలీనం చేస్తే.. యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తోందని ధ్వజమెత్తారు. 13గంటల పనివిధానం రద్దు చేయాలని, ఓటీ అలవెన్స్‌లు చెల్లించాలని, బలవంతపు ఓటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా శ్రీకాకుళం రెండో డిపోలోని ఓటీలన్నీ సింగిల్ డ్యూటీలుగా మార్చి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. నిరాహార దీక్షలో జేఏసీ ప్రతినిధులు కె.సూర్యప్రకాశరావు, ఆర్.మల్లేశ్వరరావు, ఎ.వి.ఆర్.మూర్తి, కె.రామప్పడు, పి.గంగారావు, జి.మణిమాల, ఆర్.తారకేశ్వరరావు, జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

టెక్కలి రూరల్: టెక్కలి పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13న వేలం నిర్వహించనున్నట్లు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఒక టాటా మ్యాజిక్, 4 ద్విచక్ర వాహనాలకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని పీఎస్‌కాలనీలో శనివారం పేకాట ఆడుతూ ఐదుగురు జూదరులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.11,580 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులకు కంకణాలు



విద్యార్థులకు కంకణాలు కడుతున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని మొండేటి వీధిలో లక్ష్మీగణపతి ఆలయం 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, 1008 కలాలు, కంకణాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మూలమంత్రంతో హవనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు విద్యార్థులకు పెన్నులు, కంకణాలు ఉచితంగా పంపిణీ చేశారు.

పట్టుదలతో చదివితే కొలువు సులువే

రణస్థలం: అంకితభావంతో కష్టపడి చదివితే ఉద్యోగం తప్పక వస్తుందని, అలాకాకుండా కటాఫ్ తగ్గించండంటూ ధర్నాలు చేస్తే కేసులు తప్పవని జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ అన్నారు. జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో ఏసీఎఫ్ అకాడమీ విద్యార్థులకు శనివారం పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఎంపిక పోయినా చాలా నోటిఫికేషన్లు వస్తుంటాయని, పట్టుదలతో చదివితే తప్పకుండా ప్రభుత్వ కొలువు వస్తుందని చెప్పారు. తాను జనరల్ కేటగిరీలో ఎస్సై ఉద్యోగం సాధించగలిగానంటే రాత్రింబవళ్లు కష్టపడి చదవడం వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ అకాడమీ శిక్షకుడు పి. శేఖర్, విద్యార్థులు ఉన్నారు.

వన్‌వే ట్రాఫిక్ నిబంధనల అమలు

గార: వత్సవలస రాజమ్మ తల్లి జాతరకు శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండో వారం జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అక్కడే రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం సముద్రస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. శ్రీకూర్మం జంక్షన్, తూలుగు మీదుగా వత్సవలస వరకు వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు అమలు చేశారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వైపు వాహనాలు వెళ్లాలని పోలీసులు సూచించారు. గార ఎస్ఐ ఎం.మధుసూదనరావు పోలీసులకు తగు సూచనలిచ్చారు.

సమన్వయమే కృషి మేళా లక్ష్యం

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బిశ్వరాజ్ రథో
- జయపురంలో కొనసాగుతున్న జంత్రపతి మేళా–2023



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బిశ్వరాజ్ రథో



వేదికపై వివిధ విభాగాల అధికారులు

జయపురం: రైతులు, ఉత్పత్తిదారులు, వ్యాపారుల మధ్య అవగాహనకు బలమైన వేదికను నిర్మించడమే దక్షిణ ఒడిశా కృషి జంత్రపతి మేళా–2023 లక్ష్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బిశ్వరాజ్ రథో ప్రకటించారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 6నుంచి కొనసాగుతున్న జంత్రపతి మేళాలో భాగంగా వ్యవసాయ ప్రగతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై జర్నలిస్టులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ ఒడిశా రైతులకు సాగులో సాంకేతికత, అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యాంత్రీకరణ ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని, అర్హులైన వారికి సబ్సిడీ ద్వారా ప్రభుత్వం వీటిని అందిస్తోందన్నారు. దీనికి సంబంధించి బీడీఓలు, అగ్రికల్చర్ ఇంజినీర్లను సంప్రదించాలని సూచించారు. అలాగే మేళాలో పాల్గొన్న పలువురు రైతులు వ్యవసాయ యంత్రాలు, పరికరాల కొనుగోలుకు ఆసక్తి కనబరిచారన్నారు. దీనితో పాటు నాణ్యమైన విత్తనాల ఎంపిక, సాగులో మెలకువలు, మార్కెటింగ్, బ్యాంకుల నుంచి రుణాలు తదితర అంశాలపై నిపుణుల సలహాలు, సూచనలు లభించాయని పేర్కొన్నారు.

మహిళా రైతులకు ప్రయోజనకరంగా..

వ్యవసాయంలో మహిళలను ప్రోత్సహించేలా వారు సులభంగా వినియోగంచే పరికరాలను సమకూర్చడం, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, సాగునీటి నిమిత్తం సౌరవిద్యుత్ ద్వారా నడిచే మోటార్‌లు ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నామని వ్యయసాధికారి బిశ్వరాజ్ తెలిపారు. సాంకేతిక పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న సాయాలు, సబ్సిడీలు, మహిళా స్వయం సహాయక పథకాలపై వివరించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కృషి వికాశ నిర్మాణ ఇంజినీర్ రాజేంద్రప్రసాద్ పృష్టి, ఎస్‌డీపీఓ డాక్టర్ సంతోష్‌కుమార్ పాణిగ్రహి, స్కీమ్ ఆఫీసర్ ఎం.ప్రకాష్‌రావు, బొయిపరిగుడ అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి మనోజ్ తండి, ఎంకేయూవై సంతోష్ సాహు, ఏపీడీ హిమాంశు శత్పతి, నందపూర్ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఇంజినీర్ సుణ్య బెహరా, ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ తాపస్‌చంద్ర రాయ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

ప్రపంచ శాంతికి కృషి చేద్దాం



సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి అరవింద డాలి, పక్కన రాజయోగినులు

- రాష్ట్ర మాజీమంత్రి అరవింద డాలి



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న అరవింద డాలి, రాజయోగిని మంజు, మాల

బరంపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా అంతా ప్రపంచ శాంతి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి అరవింద డాలి కోరారు. నగరంలోని రామచంద్రపూర్, ప్రభూ ఉపహార్ రిక్రూట్ సెంట్రల్ హాలులో ప్రజాపతి బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ శాంతి కుండం ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రపంచ శాంతి, ఆరోగ్యం, ఆనందం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రపంచీకరణతో భూగోళం ఓ కుగ్రామంగా మారిందన్నారు. మనుషుల మధ్య విద్వేషాలు, యుద్ధాలు పెరిగిపోయాయని, దీంతో శాంతి మంత్రం పాటించాల్సి ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. ప్రతి ఒక్కరితో ప్రేమపూర్వకంగా మెలగాలని, ఇదే భగవత్ సందేశమని సూచించారు. ప్రచారకర్త రాజయోగిని మాల మాట్లాడుతూ ప్రపంచ శాంతితో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం కూడా అవసరమని, యోగ, ధ్యానం ద్వారా వీటిని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, సేవకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగుదాం..



వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో డీఎన్‌కే క్రీడా మైదానంలో కలెక్టర్ విశాల్‌సింగ్ అధ్యక్షతన ఒడిశా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రాల ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికత తప్పనిసరని తెలిపారు. దీనికి అనుగుణంగా సాగులో యాంత్రీకరణ అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా రైతులకు స్వయం సహాయక సంఘాల తరఫున ప్రత్యేక రాయితీ విధానంలో వ్యవసాయ యంత్రాలు అందిస్తోంద్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ రైతులను సన్మానించారు.



కార్యక్రమానికి హాజరైన రైతులు

కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, వివిధ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- ముగిసిన జాతీయ లోక్ అదాలత్



బరంపురం: కోర్టు ప్రాగణంలో కిక్కిరిసిన కక్షిదారులు



బరంపురం: అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

రాయగడ: ఎన్నో తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లా సెషన్స్ కోర్టు అదనపు న్యాయమూర్తి రీనా చౌదరి సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 3,717 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లాలోని గుణుపూర్, బిసంకటక్, కాసీపూర్ కోర్టుల్లో అపరాధ రుసం కింద రూ.77,61,893లు వసూలయ్యాయి. అదేవిధంగా 38 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారం కాగా, రూ.1,81,750లు వసూలు చేశారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి అమృత్‌రంజన్ నందో, న్యాయవాదులు పాల్గొన్నారు.

బరంపురంలో..

బరంపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలోని సివిల్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో వందలాది కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా న్యాయమూర్తులు రామశంకర్ హొత్తా, మీనాక్షి దేవి, టీకే రెడ్డి ఆధ్వర్యంలో మోటార్ ట్రిబ్యునల్, బ్యాంక్ రుణాలు, రోడ్డు ప్రమాదాలు, బీమా కేసులకు రాజీ కుదిర్చారు. లక్షరాది రూపాయలు కక్షిదారులకు పరిహారంగా అందజేశారు.

4,205 కేసుల పరిష్కారం



జయపురం: కేసులు విచారణలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

జయపురం: జాతీయ న్యాయసేవా సంస్థ, రాష్ట్ర న్యాయసేవ సంస్థ ఆదేశాల ప్రకారం కొరాపుట్ జిల్లాలోని జయపురం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కొరాపుట్, కొటపాడ్, బొరిగుమ్మ, దసమంతపూర్, సెమిలిగుడ కోర్టుల పరిధిలో 4,205 కేసులను పరిష్కరించారు. మొత్తం రూ.4,21,21,993లు బ్యాంక్ వసూలు, మోటారు కేసుల నష్ట పరిహారం కింద వసూలు చేసినట్లు వెల్లడించారు. న్యాయమూర్తులు రాజేష్ ఎక్కా, ఈ.విఘ్నేశ్వరరావు, పవిత్రమోహన సామల్, సీహెచ్ బాసుదేవ్ పాత్రొ, న్యాయవాదులు కౌశానంద మిశ్రా, పి.ఈశ్వరరావు, త్రినాథ్ బిశ్వాస్ రాయ్, డి.శశిభూషణరావు, గోపబంధు శాంత తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ఆస్పత్రిగా జొన్నవలస సీహెచ్‌సీ



ఆస్పత్రి భవవ నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే ధ్యేయం
- శాసన సభాపతి తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: జొన్నవలస సీహెచ్‌సీ(30 పడకల ఆస్పత్రి)ని అధునాతన సౌకర్యాలతో ఆమదాలవలస ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. దీనిలో భాగంగా వంశధార కార్యాలయం ఆవరణలోకి ఆస్పత్రిని మార్చేందుకు భవనాలను సంసిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆస్పత్రి భవన పనులను పరిశీలించారు. అనంతం స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు ఆహ్లాదకర వాతావరణం అందేలా భవన నిర్మాణాలు ఉండాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. బహిరంగ వేదిక, మదర్ థెరిస్సా, నైటింగేల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి అనుమతులతో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ పి.శ్రీనివాసరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.శ్యాంప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, డి.చిరంజీవిరావు, జె.కె.వెంకుబాబు, పార్టీ నాయకులు మామిడి రమేష్, చిన్నారావు, మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, కూన రామకృష్ణ, వైద్యశాఖ ఉన్నతాధికారులు, వంశధార అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకాలు జరిగాయి. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మా మావయ్య అనాథ కాదు

- టీడీపీ నేతలు రాజకీయం చేయడం తగదు
- సవర బారికి మేనల్లుడు కైలాష్



బారికి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం పంచాయతీ మామిడిగుడ్డి గ్రామానికి చెందిన సవరబారికి అనే వృద్ధుడి మరణంపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేసిన విషయం విదితమే. తన మావయ్య మరణాన్ని వక్రీకరిస్తూ రాజకీయం చేయవద్దని అతని మేనల్లుడు సవరకైలాష్ అన్నారు. సుమారు 15 ఏళ్లుగా అతను మంచానికే పరిమితమైతే తాను, తన భార్య సేవచేస్తూ కన్న తండ్రిలా చూసుకున్నామని చెప్పారు. ఐరిష్, వేలిముద్రలు పడకపోవడంతో కొద్దిరోజులుగా పెన్షన్ రాలేదని, అయినా రేషన్ వస్తోందని తెలిపారు. నడవలేని ఆయన పరిస్థితిని చూసి ఇటీవల ఎమ్మెల్యే రెడ్డిశాంతి అనాథాశ్రమంలో చేర్పుతామని, వృద్ధునికి అండగా ఉంటామని చెప్పారు. అయినప్పటికీ చివరిక్షణాల వరకు తామే సంరక్షణా బాధ్యతలు చూసుకున్నామని తెలిపారు. అంత్యక్రియలు కూడా చందాలు వేసి చేశామని వక్రీకరించడం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు. వయోభారంతో మరణించడం దుఃఖంలో ఉంటే.. దాన్ని రాజకీయం చేసి మరింత బాధిస్తున్నారని వాపోయారు. కుటుంబం ఉండగా ఆకలికేకలతో ఎలా మరణిస్తాడని ప్రశ్నించారు. అమాయక గిరిజనులతో రాజకీయాలు చేయవద్దని గ్రామస్తులు తెలిపారు. కాగా, వృద్ధుని కుటుంబాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం పరామర్శించారు.

కష్టజీవుల నిజాయితీ



రమేష్‌బాబుకు బ్యాగు అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

హిరమండలం: కొత్తూరు గ్రామానికి చెందిన ఎం.రమేష్‌బాబు కో–ఆపరేటివ్ ఎడ్యుకేషన్ అధికారిగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పాతపట్నం మీదుగా రుగడ, కొమనాపల్లి, కొత్తూరు వెళ్తుండగా మార్గమధ్యలో డ్యూటీ బ్యాగ్ పోగొట్టుకున్నారు. నివగాం వద్దకు వెళ్లేసరికి బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. కొమనాపల్లిలో రహదారి పక్కన భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు బ్యాగు దొరకడంతో భద్రపరిచారు. బ్యాగులో సుమారు రూ.70 వేలు నగదు, రూ.24 వేల చెక్కులు, విలువైన పేపర్లు ఉన్నారు. స్థానికులు బ్యాగులోని చెక్కుబుక్‌పై ఉన్న మొబైల్ నంబర్ ద్వారా రమేష్‌బాబుకు తెలియజేసి బ్యాగు అప్పగించారు. కష్టజీవుల నిజాయితీని పలువురు అభినందించారు.

కథా నిలయంతో స్ఫూర్తితో 'కవితా నిలయం'



కవితా నిలయం నూతన కార్యవర్గం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో నూతన సాహితీ సంస్థ 'కవితా నిలయం' ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. రచయిత జె.శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కవితా నిలయం అధ్యక్షునిగా కళాశాల డైరెక్టర్ సురంగి మోహనరావు, ప్రధాన కార్యదర్శులుగా కవి మహ్మద్ రఫీ(ఈ వేమన), భోగిల ఉమామహేశ్వరరావు లను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా కె.వి.రాజారావు, సంతోష్‌కుమార్, మహిళా కార్యదర్శిగా తేజస్విని, కోశాధికారిగా ఉదయ్‌కిరణ్, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మీ, సలహాదారులుగా శరత్‌బాబు, గోపాలరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఈవేమన మాట్లాడుతూ కథానిలయం స్ఫూర్తితో కవితానిలయం ఏర్పాటు చేశామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కవులు రచించిన కవితా సంపుటాలను సేకరించి భద్రపరచడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ప్రతి నెలా మూడో ఆదివారం కవుల రచనలపై సమీక్ష, కవిసమ్మేళనం కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

యథావిధిగా స్పందన

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహించే స్పందన కార్యక్రమం వచ్చే సోమవారం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ సూర్యకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినుతులు స్వీకరిస్తామని, జిల్లా అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

జిల్లా ఖజానా అధికారి మృతి



గణేష్

విజయనగరం: జిల్లా ఖజానా అధికారి ఎస్.ఆర్.కె. గణేష్ మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఖజానా శాఖ డీఈ ఆర్ ఎస్ కుమార్, ఏటీఓలు నితిన్‌జోషి, ఆదిత్యసింగ్, ఉద్యోగులు పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్ సంతాపం తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



బందోబస్తుపై ఎస్సై నారాయణరావుకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో ఈ నెల 18 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల బందోబస్తు నేపథ్యంలో రామతీర్థం దేవస్థానాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సై నారాయణరావుకు పలు సూచనలు ఇచ్చారు.

శ్రీకాకుళం నుంచి 30 బస్సులు

రామతీర్థంలో జరగబోయే శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి 30 బస్సులతో ప్రయాణ సేవలందిస్తామని ఆ జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. రామతీర్థం దేవాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి వయా రణస్థలం మీదుగా రామతీర్థం దేవస్థానికి రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు గణేష్

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో యువకుడు భరిణికాన గణేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్.ఐ తారకేశ్వరరావు శనివారం సాయంత్రం వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. ఎస్.కోటకు చెందిన గణేష్ కొన్నేళ్ల క్రితం పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన కామేశ్వరిని ప్రేమించి, పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. మద్యానికి బానిసైన గణేష్ తరచూ భార్యతో గొడవ పడేవాడు. శుక్రవారం రాత్రి భర్త గణేష్ తనను కొడుతున్నాడంటూ కామేశ్వరి స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసింది. దీంతో పోలీసులు వారి ఇంటికి వెళ్లి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇదే విషయం తెలిసిన కామేశ్వరి తండ్రి ఆమెను తమ ఇంటికి తీసుకువెళ్లిపోయాడు. దీంతో గణేష్ ఇంట్లోనే ఉరి వేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారి సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పార్వతీపురం: మండలంలోని పదమాయవలస, నారాయణపురం మధ్యలోని దనాన చెరువు మలుపు వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, గాయాలపాలైన వారిలో నారాయణపురానికి చెందిన ఎస్. పండయ్య, ఎన్.శ్రీను, డి.గంగులు ఉన్నారు. స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం బలిజిపేట ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వారిని తరలించినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు పేర్కొన్నారు.

చింతాడవలసలో అగ్నిప్రమాదం



మంటల్లో కాలిన ఇల్లు

మెంటాడ: మండలంలోని చింతాడవలస గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో పున్నాన అక్కునాయుడుకు చెందిన ఓ పూరిల్లు, రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. సిలెండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకేజీ కావడంతో ప్రమాదం జరిగిందని, రూ.80 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు.

కలిసుంటేనే కలదు సుఖం..



మాంగల్యం తంతునానేనా.. మమ జీవన హేతునా.. కంఠే బధ్నామి శుభగే త్వం జీవ శరదం శతం.. ఈ మంత్రాన్ని అందరూ వందలసార్లు విని ఉంటారు. ఈ మంత్రం వింటూనే వరుడు వధువు మెడలో తాళి కడతాడు. ఈ మాంగల్య ధారణతో మనం తోడూనీడగా వందేళ్లు కలిసి ఉందాం.. అని క్లుప్తంగా దీని అర్థం. వేలాది జంటలు ఈ మంత్రాన్ని అర్థం చేసుకుని బతుకులను పండించుకుంటూ ఉంటే.. కొందరు మాత్రం అపార్థాలకు, అనుమానాలకు పోయి నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సర్దుకుపోతూ కాలాన్ని మధురం చేసుకోవాల్సిన వారు.. అనవసర గొడవలకు పోయి కుటుంబాలకు చేదు మిగుల్చుతున్నారు. సిక్కోలులోనూ ఈ పెడ ధోరణి ప్రబలుతోంది. చాలాజంటలు కోర్టు మెట్లెక్కుతున్నాయి. అయితే ఇలాంటి గొడవలను పరిష్కరించే వేదికలూ ఉన్నాయి. నేడు ప్రపంచ వివాహ దినోత్సవం.



- విచ్ఛిన్నమవుతున్న వివాహ బంధాలు
- అపార్థాలే అనర్థాలకు మూలం
- కౌన్సెలింగ్ ఇస్తూ కాపురాలను నిలబెడుతున్న పోలీసులు
- నేడు ప్రపంచ వివాహ దినోత్సవం

సండే స్పెషల్

ఇచ్ఛాపురం రూరల్: మూడు ముళ్ల బంధం చాలా మందికి పల్లేరు ముళ్ల చందంలా మారుతోంది. సినిమాల ప్రభావం, పెరుగుతున్న పాశ్చాత్య ధోరణి, మనుషులను అర్థం చేసుకునే తత్వం తగ్గడంతో కాపురాలు కూలిపోతున్నాయి. సిక్కోలు జిల్లా కూడా ఇందుకు మినహాయింపు కాదు. కుల, మతాలకు అతీతంగా చాలా యువ జంటలు అనుమానం అనే కార్చిచ్చుకు బలైపోతున్నాయి. ఒక తరం ముందు వరకు కష్టనష్టాలను కలిసి పంచుకున్న దంపతులు.. తరం మారే సరికి సర్దుకుపోయే తత్వాన్ని మర్చిపోయి మనుషులను దూరం చేసుకుంటున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా పెద్ద గొడవలకు పోయి దాంపత్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు.

మనస్పర్థలతో...



పెద్దగా ఆస్తులు, చెప్పుకోదగ్గ ఆదాయ వనరులు, సమాజంలో హోదా, సౌకర్యాలు, సౌఖ్యాలు లేని రోజుల్లో భార్యాభర్తలు హాయిగా అరమరికలు లేకుండా బతికేశారు. కానీ చదువు, ఉద్యోగం, స్థాయి, హోదా అనేవి వచ్చాక ఆలోచనల్లోనూ మార్పు కనిపిస్తోంది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్న చిన్న మనస్పర్థలు, అనుమానాలు కలతలు సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగలు మధ్య విభేదాలు వేరే కుంపటికి దారి తీస్తున్నాయి. లేనిపోని అనుమానాలతో దంపతులు ఠాణా మెట్లెక్కుతుండటంతో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ చాలా మంది తీరు మారడం లేదు. కానీ కొందరు మాత్రం అర్థం చేసుకుని వివాహ బంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారు.

ఇవి కాకుండా.. భార్యభర్తల విభేదాలతో కొన్ని సందర్భాల్లో పోలీసులు, పెద్దల వద్దకు వెళితే ఎక్కడ తమ పరువు పోతుందోనని..ఎవరికీ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

గ్రామ స్థాయిలో పరిష్కారం



పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

దాంపత్యంలో సమస్యలు వస్తే ఒకప్పుడు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాల్సి వచ్చేది. కానీ నేడు సచివాలయాల్లో మహిళా పోలీసు వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఈ సదుపాయాన్ని చాలా మంది వినియోగించుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ప్రత్యేకంగా 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేసి ఇలాంటి సమస్యలను డీఎస్పీలతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ, ఎస్ఐలే కౌన్సిలింగ్ ఇస్తూ దంపతుల మధ్య సయోధ్య కుదుర్చుతున్నారు.

- జిల్లాలో 2022 జనవరి నుంచి డిసెంబర్ 31 వరకు భార్య భర్తల మధ్య ఘర్షణలు, వరకట్న వేధింపులు, గృహ హింస, ప్రేమ వివాహాలకు సంబంధించి 1,012 మంది దంపతులు ఘర్షణ పడి ఫిర్యాదు చేసుకున్నారు.
- ఇందులో 114 కేసులు నమోదు కాగా, మిగత వారిని కౌన్సిలింగ్ నిర్వహించడంతో ఆ దంపతులు సంసారం సాగిస్తున్నారు.
- 2023 జనవరి, ఫిబ్రవరి(ఇప్పటివరకు)లో వంద మంది దంపతులు ఫిర్యాదు చేయగా, అందులో 5 కేసులు నమోదు చేశారు.

ఒక్కటి చేసేందుకే ప్రయత్నం



ఘర్షణతో తగువుపడి వచ్చే దంపతులను ఒక్కటి చేసేందుకు ప్రయత్నం చేస్తుంటాం. ఘర్షణ పడి వచ్చే దంపతులపై వెంటనే కేసులు నమోదు చేయకుండా ముందుగా కౌన్సిలింగ్ చేస్తున్నాం. అయినా వినకపోతే కేసులు నమోదు చేస్తున్నాం. న్యాయవాదులు, పోలీసులతో ఏర్పడిన కమిటీ ద్వారా కౌన్సిలింగ్ ఇప్పిస్తుంటాం. ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నియమించిన మహిళా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో 'హెల్ప్ డెస్క్'ను ఏర్పాటు చేశాం.

– ఎస్.వాసుదేవ్, డీఎస్పీ, దిశా పోలీస్ స్టేషన్, శ్రీకాకుళం.

రాజీ అవసరం



ఆలు మగల మధ్య నమ్మకం ఎంత బలంగా ఉంటే కాపురం అంత సంతోషంగా ఉంటుంది. ఎంత బలహీనపడితే అంత నరకం అవుతుంది. నమ్మకం ఉన్నచోట అభద్రత ఉండదు, అనుమానాలు ఉండవు, హింస ఉండదు, రహస్యాలు ఉండవు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఆత్మవంచనలు ఉండవు. సంసారంలో దంపతులిద్దరి మధ్య భేదాభిప్రాయాలు రావచ్చు. ఒకరిని ఒకరు అర్థం చేసుకొని కొన్ని విషయాల్లో రాజీ పడటం చాలా ఉత్తమమైన మార్గం. న్యాయ వ్యవస్థలో మేము సైతం జంటను ఒక్కటిగా చేసేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తాం. ఆవేశంలో విడిపోయిన జంటలు సైతం కొన్నేళ్ల తరువాత ఒక్కటైన సంఘటనలు కోకొల్లలు.

– దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, సోంపేట

మనసు విప్పి మాట్లాడుకోవాలి



ముందుగా దంపతుల మధ్య సఖ్యత ఉండాలి. అభిప్రాయాలు నిర్మోహమాటంగా వెల్లడించుకోవాలి. ప్రశాంతంగా వ్యవహరించుకోవాలి. ఆరోపణలు, అభియోగ ధోరణి ఉండకూడదు. భాగస్వాముల్లో ఏకపక్ష నిర్ణయాలు, ప్రయత్నాలు ఆశించినంత ఫలితాలు ఇవ్వవు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండకూడదు. అప్పుడే వివాహానికి సరైన అర్థం.

– పిరియా విజయ జెడ్పీ చైర్ పర్సన్, శ్రీకాకుళం

విద్యార్థిని మృతిపై దర్యాప్తు చేయాలి



యోగేశ్వరి(ఫైల్)

మక్కువ: విద్యార్థిని కొండగొర్రె యోగేశ్వరి(16) మృతికి గల కారణాలపై దర్యాప్తు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వరుణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాలూరు మండలంలోని తీనుసామంతవలస గ్రామానికి చెందిన యోగేశ్వరి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందిందని, అయితే ఆమె మరణంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. మక్కువ కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న ఆమె, సంక్రాంతి సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిందన్నారు. ఆ తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్చారని పేర్కొన్నారు. విద్యార్థిని ఆరోగ్యంపై కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించి ఉంటారని, ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి, బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థిని విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి దుర్గను వివరణ కోరగా, సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి, యోగేశ్వరి తిరిగి పాఠశాలకు రాలేదన్నారు. ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి, అడిగితే గొంతు నొప్పితో బాధపడుతోందని, ఆస్పత్రిలో జాయిన్ చేసినట్లు తెలిసిందన్నారు. యోగేశ్వరి మృతి చెందిందన్న విషయం తెలిసిన తర్వాత బాధపడ్డామని వివరించారు.

వేడుకగా రామమందిరం ప్రారంభోత్సవం



గరుగుబిల్లిలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో రెండు రామమందిరాల ప్రారంభోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రతిష్ఠ ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే, గరుగుబిల్లి మండల కేంద్రంలోని రామమందిరం విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా కుంకుమ పూజలు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైలుపట్టాల వద్ద ఉన్న మృతదేహం పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

దత్తిరాజేరు: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన మండలంలోని పెదమానాపురం రైల్వే గేటు సమీపంలో శనివారం జరిగింది. పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. మృతుడు ఎవరన్నది ఇంకా తెలియరాలేదని, దాదాపు 60 ఏళ్ల వయసుండి, తెల్లపంచె కట్టుకున్నారని విజయనగరం రైల్వే ఎస్ఐ రవివర్మ తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు ఫోన్ నంబర్లు 9490617089, 9440591331 ను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని..



మృతి చెందిన ప్రసాదరావు

జామి: లారీ ఢీకొని రైతు బండారు ప్రసాదరావు(49) మృతి చెందిన విషాద ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రసాదరావు ఎప్పటిలాగే గడ్డిమోపుతో కల్లానికి వస్తుండగా, ఎస్.కోట నుంచి జామి వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి అతడిని తరలించగా, మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య అచ్చియ్యమ్మ, కొడుకు శ్రీనివాసరావు, కూతురు ఉషారాణి ఉన్నారు.

30 మద్యంబాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యంబాటిళ్లను చూపిస్తున్న ఎస్ఐ రాజేష్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.భూర్జవలస ఎస్ఐ రాజేష్ శనివారం వెల్లడించారు. ఇదే ఘటనకు సంబంధించి, తాడేందొరవలసకు చెందిన కిలపర్తి వెంకటరావుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

భయం.. భయం..

భామిని: ఒడిశా నుంచి భామిని మండలంలోకి చొరబడిన ఆరు ఏనుగుల గుంపు సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పామాయిల్ తోటలు, పంటలను నాశనం చేస్తుండంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మనుమకొండ-పాలవలస గ్రామాల మధ్య మెట్టభూముల్లో సాగుచేసిన పామాయిల్ మొక్కలను శనివారం పీకేశాయి. పొలాలకు వెళ్లే దారుల్లో సంచరిస్తుండడంతో రాకపోకలకు భయపడుతున్నారు.

పార్వతీపురంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్‌డీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 14, 17 బాలురు, బాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓలు విష్ణుచరణ్, నవ్య, ఏఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్ తదితరులు పాల్గొంటారన్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యకర పొడి

- అంతర్జాతీయ పోస్టర్ ప్రజెంటేషన్‌కు కంచరాం పాఠశాల ప్రాజెక్టు
- ఢిల్లీలో ఈ నెల 14, 15 తేదీల్లో ప్రదర్శన



పండూరు వేణుగోపాల్

రాజాం సిటీ: అంతర్జాతీయ పోస్టర్ ప్రజెంటేషన్‌కు 'ఇంటివద్ద తయారుచేయగల తృణధాన్యాల పొడి' అనే ప్రాజెక్టు ఎంపికై నట్టు కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం తనకు మెయిల్ వచ్చిందన్నారు. శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన పరిషత్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ రిసోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో పోస్టర్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. తృణధాన్యాలతో ఆరోగ్యకర పొడిన తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు. పొడి తయారీ విధానం, వినియోగించే పద్ధతి, పొడితో చేసిన జావ ప్రతిరోజు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను పోస్టర్ ద్వారా వివరించినట్టు ఆయన పేర్కొన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్‌కు ఎంపికైన వేణుగోపాల్‌ను డిప్యూటీ డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, హెచ్ఎం ఎం.వి.సాయిశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

తృణధాన్యాల పొడి తయారీ ఇలా...

తృణధాన్యల పొడి తయారుచేసేందుకు వరిగలు, కొర్రలు, రాగులు, ఊదలు, సామలు, అరికలు, అండు కొర్రలు, అవిశలు, గంటెలు, జొన్నలు 100 గ్రాముల చొప్పున, దనియాలు 40 గ్రాములు, జీలకర్ర 40 గ్రాములు, వాము 20 గ్రాములు చొప్పున తీసుకోవాలి. వీటన్నింటినీ వేపుకుని పొడిచేసి బాగా కలుపుకోవాలి. 25 గ్రాముల తృణధాన్యాల పొడిని, 250 మిల్లీలీటర్ల నీటిలో కొలుపుకుని బాగా ఉడికించి గోరువెచ్చగా తాగాలి. ఈ జావ రుచి కోసం తగినంత ఉప్పు తీసుకోవాలి. ఈ జావను ఒక సంవత్సరం పిల్లాడి నుంచి అన్ని వయసుల వారు తీసుకోవచ్చు.



అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికైన తృణధాన్యాల పొడి పోస్టర్

పిల్లల్లో రక్తహీనత నివారణకు చర్యలు



సూచనలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహనరావు

మక్కువ: పిల్లల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహనరావు ఆదేశించారు. మండలంలోని కాశీపట్నం కేజీబీవీ వసతిగృహం, మక్కువ, శంబర పీహెచ్‌సీలను శనివారం సందర్శించిన ఆయన అక్కడి వారి ఆరోగ్యంపై ఆరాతీశారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు రక్తహీనత బారినపడుతున్న వారు మందులు వాడడం ద్వారా రక్తహీనత నుంచి దూరం కావచ్చని తెలిపారు. ముఖ్యంగా పిల్లల్లో రక్తహీనత నివారణకు ఫోలిక్‌యాసిడ్ సిరప్‌లను వాడాలన్నారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులపై సిబ్బంది, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డి.కిరణ్‌కుమార్ రెడ్డి, పీహెచ్ఎన్ శకుంతుల, సూపర్‌వైజర్ డి.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో.. తెర్లాం క్రీడాకారుల సత్తా



ట్రోఫీ, మెడల్స్‌తో క్రీడాకారులు శివ, దుర్గాప్రసాద్

తెర్లాం: ఒడిశా రాష్ట్రంలోని పూరీ నగరంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 44వ సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లాలోని తెర్లాం మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు తమ సత్తాచాటారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యులుగా పాల్గొని, జాతీయ స్థాయిలో జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు పెరుమాళి గ్రామానికి చెందిన పి.శివ, కుమ్మరిపేట గ్రామానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్ మంచి ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నారు. ఫలితంగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల చేతుల మీదుగా అందుకుని, జిల్లా ఖ్యాతిని నలుమూలకు చాటారు.

అన్నం పెట్టిన ఆట

- క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించిన అనిత
- జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల సాధన
- గుర్ల మండలం మన్యపురిపేట సెక్రటరీగా బాధ్యతల స్వీకరణ



పంచాయతీ కార్యదర్శిగా జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న అనిత

విజయనగరం: నిరుపేద కుటుంబం.. తిండికే కటకటలాడాల్సిన పరిస్థితిలో ఆ చిన్నారి ఆటలపై మక్కువ పెంచుకుంది. తైక్వాండోలో కఠోర సాధన చేసి పట్టుసాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాల పంట పండించింది. ఇప్పుడు క్రీడా కోటాలో పంచాయతీ సెక్రటరీగా ప్రభుత్వ కొలువు సాధించి.. ఆటే.. తనకు అన్నం పెట్టిందంటూ సగౌరవంగా చెబుతోంది.. విజయనగరం శాంతినగర్‌కు చెందిన కాకి అనిత. ఆమె విజయగాథను ఓ సారి తరచిచూస్తే...

కాకి అనిత స్వస్థలం విజయనగరంలోని శాంతినగర్. తండ్రి సన్యాసిరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా.. తల్లి సత్యవతి రోజుకూలి చేస్తూ ఇటీవల మరణించారు. కుటుంబంలో ఆమెకు ఐదుగురు తోబుట్టువులు ఉన్నారు. 6వ తరగతి చదువుతున్న సమయంలో విజయనగరం బీపీఎం పాఠశాలలో తైక్వాండో శిక్షణ ఇచ్చే కోచ్‌లు సీహెచ్ వేణుగోపాలరావు, బాలాజీ వద్ద చేరింది. ఎన్నో కష్టాలను ఎదురీదుతూ క్రమక్రమంగా ఆటలో రాటుదేలింది. 2009 సంవత్సరంలో మొదటి సారిగా రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడింది. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 18 బంగారు పతకాలు కైవసం చేసుకుంది. 14 సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. సీనియర్స్, పైకా, సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు కాంస్య పతకాలు చేజిక్కించుకుంది. ఆడపిల్లలకు ఆటలెందుకని చుట్టుపక్కల వారు సూటిపోటి మాటలు చెప్పినా తైక్వాండో క్రీడలో రాణించేందుకు ప్రోత్సహించిన తన తల్లి ఉద్యోగం సాధించిన సమయంలో సజీవంగా లేకపోయిందంటూ కన్నీటిపర్యంతమైంది.



తైక్వాండో క్రీడలో సాధించిన పతకాలతో అనిత

చదువులోనూ మేటి..

అనిత క్రీడలతో పాటు చదువులోనూ మేటిగా నిలిచింది. క్రీడల కోటాలో ఆంధ్రాయూనివర్సిటీ తరఫున ఎంబీఏ పూర్తిచేసింది. ఇప్పుడు తైక్వాండో క్రీడాంశంలో రిఫరీ స్థాయికి ఎదిగింది. జాతీయ స్థాయి పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన అనుభవాన్ని సొంతం చేసుకుంది. తల్లి మరణానంతరం ఇంట్లో తండ్రితో పాటు కలిసి ఉంటున్న రెండవ అక్క అందించిన ఆర్థిక సాయమే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని అనిత పేర్కొంది. ఇటీవలే జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంచాయతీ సెక్రటరీగా నియామకపత్రం అందుకుని గుర్ల మండలం మన్యపురిపేట పంచాయతీ కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించానని, ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్టు వివరించింది.